క్లుప్తంగా

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పీతల కనకయ్య వీధికి చెందిన బంక లక్ష్మి, అచ్యుతరావు(50) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం కాగా, అచ్యుతరావు క్యాటరింగ్ పని చేస్తుంటాడు. గత నెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అచ్యుతరావు 13 రోజులైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో స్నేహితులు, బంధువులను విచారించినా జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ ఇండియాపై ఫ్లాష్‌మాబ్



పటమట(విజయవాడతూర్పు): వికసిత భారత్ – 2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, భారతదేశం విద్య వైద్య అవస్థాపన-సాంకేతిక రంగాల్లో యువత ముందుండాలని మేరీస్ స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ కాసింత క్వాడ్రస్ తెలిపారు. వికసిత భారత్ లక్ష్యంగా కళాశాల విద్యార్థినులు పటమటలోని ఎల్ఈపీఎల్ ఐనాక్స్ మాల్ ప్రాంగణంలో ఆదివారం డ్రగ్స్ వాడటం మంచిది కాదని, డ్రగ్స్ వల్ల యువత అనారోగ్యం బారిన పడుతున్నారని దీనిపై ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. భావి భారత పౌరులైన యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకూడదనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన స్కిట్ చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎన్‌సీసీ కెప్టెన్ శైలజ, సబ్ లెఫ్టినెంట్ స్వప్న పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం భక్తులకు ప్రసాదాలను అర్చకులు వంపిణీ చేశారు. సేవలో పాల్గొన్న ఉభయ దాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదులు - పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు – పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర వాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో, చిట్టినగర్ సర్కిల్ – 1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్ – 2, పటమటలోని సర్కిల్ – 3 కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఆయా ప్రాంతాల స్థానికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రోగులకు వైద్య పరీక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సంగీత పోలి క్లినిక్ ఆధ్వర్యంలో కొత్తపేట కోమలావిలాస్ సెంటర్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రజా వైద్యశాల ఎండీ డాక్టర్ శ్రావణ్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ విభాగాల్లో రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి హార్ట్‌కి సంబంధించిన ఈసీజీ ఉచితంగా చేసి మందులు అందజేశామన్నారు. సంగీత పోలి క్లినిక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. వైద్యశిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ పి.రమ్య, జనరల్ మెడిసిన్ డాక్టర్ హరిహరన్, ఆర్థోవిభాగంలో డాక్టర్ రత్నాకర్ వైద్య సేవలను అందించారు. శిబిరంలో వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్, కార్పొరేటర్ బోయి సత్యబాబు, శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల కోలాహలం

- వరుస సెలవులతో పెరిగిన తాకిడి
- సర్వ దర్శనానికి రెండు గంటలు
- పాత మెట్ల మార్గంలో పూజలు



క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవుల నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గత రెండు రోజులుగా సుముహుర్తాల వేళ ఒక్కటైన నూతన వధూవరులు, కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

కిటకిటలాడిన క్యూ లైన్లు

భక్తుల రద్దీతో ఘాట్‌రోడ్డుతో పాటు మహా మండపం మెట్లు, లిఫ్ట్ మార్గాలు కిటకిటలాడాయి. రద్దీ అధికం కావడంతో మహా మండపం 5వ అంతస్తు వరకే లిఫ్టులను అనుమతించారు. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్లలో భక్తులు బారులు తీరి ఉండటంతో వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. క్యూలైన్‌లో భక్తులు త్వరత్వరగా ముందుకు



అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కదిలేలా చర్యలు తీసుకున్నారు. మరో వైపున భక్తుల క్యూ ఘాట్‌రోడ్డు మార్గంలో ఓం టర్నింగ్ వరకు, మహా మండపంలో 5వ అంతస్తు వరకు చేరింది. దీంతో సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది.

కొండ దిగువన కార్లు..

భక్తుల వాహనాలతో ఘాట్‌రోడ్డులోని గాలిగోపురం నుంచి హెడ్ వాటర్ వర్క్స్ వరకు కార్లు, ఇతర వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. దీంతో భక్తులు తమ కార్లను హెడ్ వాటర్ వర్క్స్, ఫ్లై ఓవర్ దిగువన, పున్నమి ఘాట్‌లో నిలుపుకుని దేవస్థాన బస్సులు, ప్రైవేటు వాహనాల్లో ఆలయానికి చేరుకున్నారు. కనకదుర్గానగర్‌లోకి కేవలం ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతించారు. కార్లు, ఇతర వాహనాలను సీతమ్మ వారి పాదాలు, వీఎంసీ కార్యాలయం, కెనాల్‌రోడ్డుకు మళ్లించారు.

అమ్మవారికి విశేష కుంకుమార్చనలు

శ్రావణ మాసం కావడంతో భక్తులు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమ పూజలు నిర్వహించారు. పాత మెట్ల మార్గంలో మెట్ల పూజలు, ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కుంకుమార్చన, సహస్ర నామార్చన, లక్ష కుంకుమార్చన జరిపించుకున్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ ఉభయ దాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు సాయం



టీచర్‌తో ఎస్టీఆర్‌హెచ్ స్కూల్ పూర్వ విద్యార్థులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు ఆరోగ్య, ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలుసుకున్న ఆ పూర్వ విద్యార్థులు తమ వంతుగా సాయాన్ని అందజేశారు. వన్‌టౌన్‌లోని పేరయ్య మాస్టర్ స్కూల్‌లో చిన్న హైమ టీచర్‌గా విధులు నిర్వహించేవారు. గత కొంతకాలంగా టీచర్ ఆరోగ్య, ఆర్థిక పరిస్థితి సరిగా లేదు. దీంతో 1989–94 శ్రీతేలప్రోలు రాజాహైస్కూల్(ఎస్టీఆర్‌హెచ్)కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం టీచర్ ఇంటికి చేరుకుని పరామర్శించారు. తమ వంతుగా నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు, పండ్లు, రూ.12 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది ఉన్నా తాము ఉన్నామనే విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో వాసి శ్రీనివాసు, రాధాకృష్ణ, సుధాకర్, రమేష్, కొండలరావు, సంపత్, సురేష్, ఎల్లారావు, మంగప్రసాద్, నవీన్, సుభానిలు ఉన్నారు.

కామర్స్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న విజయవాడ చాప్టర్ ప్రతినిధులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ నిర్వహించిన కామర్స్ టాలెంట్ హంట్ – 2024లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో విజయవాడ, కృష్ణాజిల్లాలోని స్కూల్స్‌లో చదివే పదో తరగతి విద్యార్థులకు, ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివే కాలేజీ విద్యార్థులకు ఆదివారం కామర్స్ టాలెంట్ హంట్ – 2024 నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ప్రముఖ కాలేజీల నుంచి పెద్ద సంఖ్యలో జూనియర్, సీనియర్ ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టెస్ట్ ద్వారా విద్యార్థులందరూ కామర్స్‌లో తమకు ఉన్న పట్టు, ప్రతిభ నిరూపించుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో, మూడు, నాల్గవ బహుమతులుగా రూ.5 వేలు, రూ.2,500, రూ.1000 నగదు అందజేశారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో విజయవాడ చాప్టర్ సెక్రటరీ సుంకర పూర్ణిమ, పొన్నగంటి వినయరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారిణులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీ శ్రావ్య నర్తన కూచిపూడి నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మవారి దర్శనం అనంతరం రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యానికి మంత్రముగ్ధులై ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఔత్సాహిక కళాకారులతో గజ్జె పూజ



నాట్యం చేస్తున్న చిన్నారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కూచిపూడి నాట్య సంప్రదాయంలో ప్రధాన అంశమైన గజ్జె పూజను ఔత్సాహిక కళాకారులైన చిన్నారులతో ఘనంగా నిర్వహించారు. విద్యాధరపురంలోని శ్రీవాగ్దేవి కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో నాట్యాచార్యులు సప్పా శివకుమార్, ధనలక్ష్మి నేతృత్వంలో ఆదివారం చిన్నారులతో పూజాధికాలు చేయించారు. అనంతరం వారికి ఆయన మువ్వల గజ్జెలను అందజేశారు. ఈ సందర్భంగా పలు సంప్రదాయ కీర్తనలకు వారి చేత నర్తింప చేయగా నేరెళ్ల ఫణికుమార్(మృదంగం), వనమాలి(వేణువు) వాయిద్య సహకారం అందించారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్య కళాకారిణి జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టాలలో గజ్జె పూజ ఒకటని తెలిపారు. నర్తకి నటరాజు భగవానుడు ఆ తరువాత గురువు నుంచి ఆశీర్వాదం కోరుతుందన్నారు. అనంతరం ఆమె గజ్జెలను ధరించే ముందు వాటిని ప్రార్థిస్తూ మంచి కళాకారిణిగా గుర్తింపు పొందాలని కోరుకుంటుందని చెప్పారు. నాట్యం చేసేటప్పుడు కాలికి ఉన్న గజ్జె ఘల్లు..ఘల్లు మంటుంటే ఆ నర్తకి మనసు ఉప్పొంగి నాట్యం చేస్తుందని, ఆ సమయంలో వారి హావభావాలు వర్ణనాతీతమని పేర్కొన్నారు.

తుర్లపాటి జీవితం స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

విజయవాడ కల్చరల్: సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు పాత్రికేయ జీవితం స్ఫూర్తిదాయకమని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు, అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం తుర్లపాటి 91 వ జయంతి వేడుకలను నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తుర్లపాటి 14 సంవత్సరాల వయస్సులోనే పాత్రికేయ జీవితం ప్రారంభించారన్నారు. జయంతి సభలో గోళ్ల నారాయణరావు, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, డాక్టర్ సమరం, కొప్పరపు బలరామకృష్ణమూర్తి, ప్రసూనా రామన్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు, తుర్లపాటి కుమారుడు జవహర్, ఆయనతో అనుబంధం గుర్తు చేసుకున్నారు.

బ్లేడ్ బ్యాచ్ నుంచి కాపాడండి

హనుమంతరాయ గ్రంథాలయంలో, కొత్తా పూర్ణానందం కళావేదికపై కార్యక్రమాలు జరిగే సమయంలో మందుబాబులు, బ్లేడ్ బ్యాచ్ సభ్యులు గొడవలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో సాంస్కృతిక కార్యక్రమాలకు అంతరాయం కలుగుతోంది. తుర్లపాటి సభలో కొందరు గొడవకు దిగారు.

గొయ్యి తవ్వారు... పూడ్చడం మరిచారు



ఏనుగుల అంజయ్య వీధిలో అస్తవ్యస్తంగా ఉన్న గొయ్యి

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులకు నగరపాలకసంస్థ వాటర్‌సెక్షన్ సిబ్బంది గొయ్యి తవ్వి పనులు చేశారు. కానీ తిరిగి గొయ్యిని పూడ్చకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక 49వ డివిజన్, టైలర్‌పేటలోని ఏనుగుల అంజయ్యవీధిలో తాగునీటి పైప్ లైన్లు మరమ్మతులకు గురవ్వడంతో 20 రోజుల క్రితం వాటర్ సెక్షన్ సిబ్బంది గొయ్యి తవ్వి పనులు చేపట్టారు. పనులు పూర్తయినా తవ్విన గొయ్యిని తిరిగి పూడ్చకుండా వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్విన గొయ్యను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

కళాశాల విద్యా వ్యవస్థల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కళాశాల విద్యా వ్యవస్థల్లో సమస్యలు పరిష్కరించాలంటూ ఆదివారం అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘం నేతలు ఎమ్మెల్సీలు డాక్టర్ చిరంజీవి, పి.అశోక్ బాబు, డాక్టర్ రామకృష్ణలకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాల ప్రవేశాలు ప్రతి ఏడాది జూలై మాసంలోగా జరపాలని, ఒక మేజరు విధానం రద్దు చేయాలన్నారు.

దుర్గమ్మ మూలవిరాట్ ఘటనపై ఫిర్యాదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువున్న కనకదుర్గమ్మ మూలవిరాట్ సోషల్ మీడియాలో రావటంపై ఆలయ అధికారులు స్థానిక వన్‌టౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ ఉదయం 5.15 నిమిషాల సమయంలో అమ్మవారి మూలవిరాట్‌ను వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. దీనిపై భక్తులు, ఇతర మీడియాలో వార్తలు రావటంపై ఆలయ అధికారులు స్పందించారు. వీడియో ఎప్పుడు తీశారు అనే అంశాలన్ని సాంకేతిక సిబ్బంది, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. దీనిపై గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి మూలవిరాట్‌ను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారని, విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామరావు రాతపూర్వకంగా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక ఎస్‌ఐ వి.రమ్యశ్రీసత్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

180 మందికి వైద్య పరీక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పరిధిలోని మౌలానగర్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర మహిళా విభాగం, హోప్ విన్స్ హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సమితి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షామా సుల్తానా అధ్యక్షత వహించారు. 180 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు మహ్మద్ ఫారూఖ్ షుబ్లీ, సమితి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఎంఎస్ మెహెపారా, వైద్యులు సారిక షేక్, అహమ్మద్ షఫీ షేక్, బి.స్వప్న, కె.రవికిరణ్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి దుర్మార్గం

మధురానగర్(విజయవాడసెంట్రల్): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి దుర్మార్గమని యావత్ ప్రపంచం ఈ దాడులను ఖండించాలని శ్రీ విష్ణుసహస్రనామ పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ మహిళలను వివస్త్రగా మార్చి వారిపై దాడులకు పాల్పడటంతో పాటు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పంపించి పైశాచిక ఆనందం పొందుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ఒక్క సెక్యులర్ నాయకులు కూడా స్పందించకపోవటం సిగ్గుచేటన్నారు. హిందువులపై వ్యక్తిగత దాడులు, ఆస్తుల ధ్వంసం, మహిళలపై పైశాచిక దాడులను ఖండించాలన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి పాశవికం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడి పాశవికమైందని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం(ఐప్సో) ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణ్‌కుమార్, హరిచందన్‌సింగ్ భట్ పేర్కొన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగిన ఐప్సో రాష్ట్ర సమావేశాల సందర్భంగా పాలస్తీనాకు సంఘీభావం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనాలో కష్టాలు పడుతూ పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలిపారు. జనావాసాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, సహాయక చర్యలకు వచ్చిన స్వచ్ఛంద సంస్థలు, కవరేజ్ కోసం వెళ్లిన పాత్రికేయుల మీద కూడా ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడుల్లో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, చాలా మంది తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. గాజాలో పాలస్తీనీయన్లు ఆహారం, నీరు, విద్యుత్ లేక దయనీయమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారన్నారు. యుద్ధాన్ని వెంటనే ఆపాలని, శాంతిని పునరుద్ధరించాలని కోరారు. ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐప్సో సలహాదారుడు యాదవరెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి బుడ్డిగ జమిందార్, ఐప్సో అధ్యక్షవర్గ సభ్యుడు బుడ్డి సుధాకర్, తెలంగాణా ఐప్సో నాయకుడు తిప్పర్తి యాదవ్ మాట్లాడారు. అనంతరం 24 మందితో నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు.

నూర్‌బాషా సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఖాశింబీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ స్టేట్ నూర్‌బాషా(దూదేకుల) బీసీ ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా గొల్లపూడి రామరాజ్యనగర్‌కు చెందిన షేక్ ఖాశింబీ ఎన్నికయ్యారు. సంఘం వ్యవస్థాపకుడు కె.నాగుల్‌మీరా ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు కే పీరు మహమ్మద్ అధ్యక్షతన ఇటీవల విజయవాడలోని చాంద్ కల్యాణ మండపంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా ఉపాధ్యక్షులుగా బాషా, బాజీ, జాయింట్ సెక్రటరీలుగా డి.హుస్సేన్, షేక్ నాగుల్‌మీరావలి ఎన్నికయ్యారు. వారికి సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే ఖాజా రహమతుల్లా నియామకపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పార్టీలకతీతంగా నూర్‌బాషాల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాశిం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వ్యక్తి అదృశ్యమైన సంఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపురం ప్రాంతానికి చెందిన సత్తి రవీంద్రరెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. రవీంద్రరెడ్డి బంధువైన తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ప్రాంతానికి చెందిన గొలుగూరి ఈశ్వరరెడ్డి(38) కూడా రవీంద్రరెడ్డితో కలిసి ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ ఉంటాడు. వారానికి రెండు రోజులు రామకృష్ణాపురంలోని రవీంద్రరెడ్డి ఇంటికి వచ్చి వారి ఇంటిలోనే ఉండి వెళ్తుంటాడు. అలానే ఈ నెల 9న కూడా రామకృష్ణాపురానికి వచ్చిన ఈశ్వరరెడ్డి ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి 11 గంటలకు రవీంద్రరెడ్డికి ఫోన్ చేసి 'నేను తప్పు చేశాను.. చనిపోతాను' అని చెప్పి తన ఫోనును స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో ఆయన విషయాన్ని తన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేసి ఈశ్వరరెడ్డి ఆచూకీ కోసం వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. రవీంద్రరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణమ్మ చెంత.. పులకింత

కృష్ణా నదికి వరద ఉధృతి కొనసాగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నగర వాసులు ప్రకాశం బ్యారేజీకి తరలివచ్చారు. కృష్ణమ్మ పరవళ్లను ఆస్వాదించడంతో పాటు మొబైల్ ఫోన్లలో సెల్ఫీలు తీసుకుని ఆనందంగా గడిపారు. ప్రకాశం బ్యారేజీ పరిసరాల్లో వాహనాలు, పర్యాటకులతో రద్దీ నెలకొంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





